క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అవనిగడ్డ: స్థానిక నాగాయలంక రోడ్డులోని నూతన ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం వల్ల కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాని నిలిపివేస్తున్నట్టు ఏఈ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ మండల పరిధిలోని 3, 5, 6 వార్డులు, కొత్తపేట, రామకోటిపురం, తిప్పపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

13 నుంచి ఉర్వేళమ్మ జాతర

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో మూడేళ్లకు ఒకసారి జరిగే గ్రామదేవత ఉర్వేళమ్మ జాతర మహోత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, గ్రామోత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 13న పోతురాజుస్వామికి పోత తదుపరి మద్ది రావమ్మ, మదరా సాహెబ్ జాతర ఉత్సవం నిర్వహిస్తారు. 14న గుడారం, మదరా సాహెబ్ జెండా ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ది సొల్యూషన్ మాస పత్రిక సంపాదకుడు అబ్రహాం మృతి



మచిలీపట్నంటౌన్: ది సొల్యూషన్ క్రైస్తవ మాస పత్రిక సంపాదకుడు బొకినాల అబ్రహాం(72) బుధవారం మృతిచెందారు. నగరంలోని సర్కారుతోటలోని ఆయన స్వగృహంలో అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు. ఆయన మృతదేహాన్ని సొంత ఊరైన కోలవెన్నుకు తరలించి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. నగరానికి చెందిన పాస్టర్లు నివాళులర్పించారు. అబ్రహాం కుటుంబ సభ్యులకు సీనియర్ జర్నలిస్టు కుంపటి జయాకర్‌బాబు, ఏపీయూడబ్ల్యూజే కృష్ణాజిల్లా శాఖ ఉపాధ్యక్షుడు పైడిపాముల అశోక్‌కుమార్ తదితర పాత్రికేయులు సంతాపం తెలిపారు.

నేటి నుంచి శ్రీకృష్ణ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ద్వారకా ఆలయం ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం నుంచి జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. మూడు రోజలపాటు బ్రహ్మశ్రీ చావలి దుర్గా మల్లికార్జునరావు దీక్షితుల ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రచారం ఫుల్.. వసతులు నిల్

- మంగినపూడి బీచ్ ఫెస్టివల్‌లో పూర్తికాని ఏర్పాట్లు
- టాయిలెట్లు, తాగునీరు లేక ఇబ్బందులు



గురువారం సాయంత్రం వరకు బీచ్ ఫెస్ట్ పనులు పూర్తికాని దృశ్యం

మచిలీపట్నం రూరల్: మంగినపూడి బీచ్‌లో మసుల బీచ్ ఫెస్టివల్‌లో సరైన వసతులు ఏర్పాటు చేయకపోవడంతో తొలిరోజు గురువారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత కొద్ది రోజుల నుంచి గనులు, భూగర్భ వనరుల, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా అధికార యంత్రాంగం ప్రతిరోజు బీచ్ ఫెస్టివల్ పనులను తనిఖీలు చేస్తున్నప్పటికీ ఏర్పాట్లు పూర్తికాలేదు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కావలసిన ఈ ఫెస్టివల్స్ సాయంత్రం నాలుగు గంటలకు మార్పు చేసినప్పటికీ కూడా పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. సాయంత్రం 6.30కి తూతూ మంత్రంగా ప్రారంభించారు.

ఆసక్తి చూపని క్రీడాకారులు

ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రధాన అమరావతి ఐకానిక్ ద్వారం పనులు కూడా పూర్తి కాలేదు. పోలీస్ సిబ్బందికి కూడా తాగునీరు, భోజన వసతులు అందరికీ అందలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని అతి ఉత్సాహ ప్రచారమే గాని కొన్ని రాష్ట్రాల నుంచి ఒక్క క్రీడాకారుడు కూడా పాల్గొనలేదు. క్రీడాకారులు పాల్గొనకపోవడంతో ఆ రాష్ట్ర పేరుతో ఏర్పాటు చేసిన ప్లకార్డులు కుప్పలుగా మంత్రి ప్రసంగిస్తున్న డయాస్ ముందే పడవేసి ఉంచటం గమనార్హం.



బీచ్ ఒడ్డున శుభ్రత, రంగులకు నోచుకోని దేవతామూర్తుల విగ్రహాలు



మంగినపూడి బీచ్‌లో హెచ్చరిక బోర్డు దుస్థితి

ప్రజాధనం దుర్వినియోగం

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మేకల సుధాకర్

కోనేరుసెంటర్: బీచ్ ఫెస్టివల్ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు మేకల సుధాకర్ విమర్శించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం నగర కమిషనర్ తీరుపై మండిపడ్డారు. నగరంలో పనిచేయాల్సిన శానిటేషన్ సిబ్బందిని బీచ్ ఫెస్టివల్ పేరుతో మంగినపూడిబీచ్‌లో పనికి వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిని నగరంలో పనులకు ఉపయోగించకుండా కూటమి నేతల స్వప్రయోజనాల కోసం వాడుకోవడం కరెక్టేనా అని ప్రశ్నించారు. కమిషనర్ పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టి ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్, నగర ఉపాధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, కార్పొరేటర్లు పర్ణం సతీష్, తిరుమలశెట్టి ప్రసాద్, కాగిత జవహర్, గాజుల భగవాన్, బూరగ రామారావు, రఫీ, బాషా, చంటి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు సుధాకర్, ఇతర నాయకులు

ఉద్యోగుల సేవలు మరువలేనివి

మచిలీపట్నంటౌన్: ఉద్యోగులు వారి పదవీ కాలంలో ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్(ఎంఈఎఫ్) కృష్ణా జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్‌బాబు పేర్కొన్నారు. మచిలీపట్నంలో ట్రాఫిక్ ఎస్ఐ తోడేటి మధుసూదన్‌రావు, గుడివాడ మున్సిపాలిటీలో ఫిట్టర్‌గా పని చేస్తూ మే 31వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన బండారు వెంకటేశ్వరరావులను ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఎంఈఎఫ్ సీనియర్ నాయకుడు గంధ్రపు సీనయ్య మాస్టారు, ఎంపీడీవో పెనుమత్స మధు, ఎంఎంసీ కోఆప్షన్ సభ్యుడు బీ రవి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే శరత్‌కుమార్, ఎంఈఎఫ్ జిల్లా కార్యదర్శి బీడెల్లి మరియ కుమార్, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించిన ఎంఈఎఫ్ నాయకులు

ప్రశాంతంగా లాసెట్, ఎడ్‌సెట్ పరీక్షలు

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన ఏపీ లాసెట్, ఎడ్‌సెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు జరిగిన ఏపీ లాసెట్‌కు 180 మందికిగాను 152 మంది హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరిగిన ఏపీ ఎడ్‌సెట్ పరీక్షకు 171 మందికిగాను 137 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఆంధ్రజాతీయ కళాశాల ఆవరణలో మొక్కను నాటుతున్న ఏసీ సాంబశివరావు



నందమూరులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



శ్రీకాకుళంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో సుబ్బారావు తదితరులు

మచిలీపట్నంటౌన్: పర్యావరణాన్ని పరిరక్షించడానికి అందరూ బాధ్యత తీసుకోవాలని దేవదాయ, ధర్మాదాయశాఖ జిల్లా అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఎస్‌వీ సాంబశివరావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో గురువారం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యాలయ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ మొక్కలు నాటారు.

పెడన: మండలంలోని నందమూరు గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కలు నాటే ప్రక్రియను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్జా వెంకటనగేష్, ఎంపీడీవో అరుణకుమారి, సర్పంచు పరసా నరసింహారావు పాల్గొన్నారు. అలాగే పెనుమల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచు గరికపాటి వెంకటరామానాయుడు మొక్కలు నాటారు.

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీడీవో డి.సుబ్బారావు పలువురు అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

గూడూరు: మండలంలోని రామరాజుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గూడూరు ఎంపీపీ సంగా మధుసూధనరావు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మోటేపల్లి వనజ, ఈఓపీఆర్డీ బి.రాజేశ్వరి, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంటుమిల్లి: మండలంలో గురువారం పర్యావరణ దినోత్సవం జరుపుకొన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అధికారులతో మొక్కలు నాటారు. అలాగే బంటుమిల్లిలో రూఫాన్ సిమెంటు కంపెనీ ప్రతినిధులు స్థానిక ఏజంట్ జూలూరి సంపత్‌తో కలిసి మొక్కలు నాటారు.

కృత్తివెన్ను: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ స్థానిక అధికారులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ

కృత్తివెన్ను: మండలంలోని కృత్తివెన్ను పంచాయతీ వాలంక గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీకోదండరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పులిగడ్డలో యోగా శిక్షణ

పులిగడ్డ(అవనిగడ్డ): మండలంలోని పులిగడ్డలో గురువారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక పంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావుతో పాటు కార్యదర్శి, పలువురు వార్డు సభ్యులు యోగా చేశారు.

ఉన్నతాధికారులను కలిసిన ఉపకులపతి

మచిలీపట్నంరూరల్: కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే రాంజీ గురువారం అమరావతి సచివాలయంలో పలువురు ఉన్నతాధికారులను కలిశారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్‌ను కలిసి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి వర్శిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్‌ను కలిసి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇరువురు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు వీసీ ఆచార్య రాంజీ తెలిపారు.

రాయితీ విత్తనాల పంపిణీ

బంటుమిల్లి: రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన పంటలు పండించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని ముంజులూరు గ్రామ రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కే)లో గురువారం ఆయన వరి విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, సేవలను వివరించారు. మండల ఏఓ శివరామకృష్ణ, బంటుమిల్లి డీసీ చైర్మన్ బొర్రా కాశీ, బర్రిపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ పర్ణం సూర్యప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.







కార్మికుల హక్కులను కాలరాస్తోన్న ప్రభుత్వం

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా పేర్కొన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోలను వ్యతిరేకిస్తూ స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జీవోతో కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను ఒక్కసారిగా కాలరాసిందని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టిన కార్మికులకు ఏడాది తర్వాత పని గంటలకు 10కి పెంచుతూ సరైన బహుమతి ఇచ్చారని హేళన చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, కొమ్ముకూరి రాజేశ్వరరావు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

గూడూరు: కప్పలదొడ్డిలో పునఃనిర్మించిన శ్రీహేమా కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దాదాపు 80 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు సుమారు రూ.70లక్షలతో ఆలయాన్ని పునఃనిర్మించారు. మొదటి రోజు ప్రారంభమైన పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పైడమ్మ ఆలయం సమీపంలో మొక్కలు నాటారు.

ముగిసిన రాజగోపుర మహోత్సవాలు

చల్లపల్లి: మండలంలోని నడకుదురు క్షేత్రంలో గత రెండు రోజులుగా జరుగుతున్న రాజగోపుర వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ శ్రీపృథ్వీశ్వర స్వామివారి విశిష్టత గురించి ఉపన్యసించారు. నరకాసురుణ్ణి వధించి మోక్షం కలిగించిన ఈ ప్రాంతం గురించి పురాణాల్లో వివరించారని తెలిపారు. రాజగోపురంతో పాటు ఆలయ ప్రాంగణంలో ఎన్నో నిర్మాణాలు, దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించిన దాతలు మండవ రవీంద్ర, రమణకుమారి దంపతులను అభినందించారు. అనంతరం యోగశాలలో పూజలు చేశారు. బాలబాలికల నాలుకపై బీజాక్షరాలు లిఖించారు. ఆలయంలో మొక్కలు నాటి చెట్లను భక్తితో పూజించాలని సూచించారు. ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసు, దాతలు మండవ రవీంద్ర, రమణకుమారి దంపతులు మాడుగుల నాగఫణి శర్మను సన్మానించారు. కాగా వార్షిక హోత్సవాల ముగింపు రోజైన గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. గ్రామ పెద్దలు రిటైర్డ్ ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణ, మల్లుపెద్ది త్రివిక్రమరావు, గొరిపర్తి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.



శ్రీపృథ్వీశ్వరస్వామివారి విశిష్టతను వివరిస్తున్న మాడుగుల నాగఫణి శర్మ



భక్తిశ్రద్ధలతో కల్యాణ మహోత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్ పేటలో వేంచేసి ఉన్న శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్వామివారిని పెళ్లి కుమారుడిని చేశారు. చలమలశెట్టి లక్ష్మీకృష్ణ - శ్రీలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ ఘట్టాన్ని నిర్వహించారు.

విజయక్రాంతి విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



విద్యార్థినులతో కళాశాల కరస్పాండెంట్

చల్లపల్లి: ఉత్తమ ఫలితాలు సాధించినందుకు స్థానిక విజయక్రాంతి కళాశాల విద్యార్థులకు బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ప్రతిభా అవార్డులు లభించినట్లు కళాశాల కరస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్ గురువారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీఈసీ విద్యార్థులు మట్లా శ్రీవల్లీ, పొట్లూరి త్రివేణి, కాగిత భార్గవి ఈనెల 9వ తేదీన మచిలీపట్నంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందుకుంటారని తెలిపారు. అవార్డులు గెలుచుకున్న విద్యార్థులను కరస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్ జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.

రూ.20 వేల బంగారు నాణెం బహూకరణ



ఘంటసాల: ఘంటసాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో గ్రామానికి చెందిన పాల ఉత్పత్తిదారుడు కొల్లూరి శ్రీనివాసరావు కుమారుడు హికిలేష్ దంపతులకు కృష్ణామిల్క్ యూనియన్ వారు రూ.20 వేల విలువైన బంగారు నాణాన్ని గురువారం బహూకరించారు. ఘంటసాలలో జరిగిన వివాహ రిసెప్షన్‌లో మిల్క్ యూనియన్ సభ్యులు వేమూరి సాయి వెంకటరమణ, పాల సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్ బంగారు నాణాన్ని అందించారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ గోపినాథ్, రూటు సూపర్ వైజర్ తమ్మన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పులిగడ్డ అభివృద్ధికి చర్యలు



మోపిదేవి: పులిగడ్డ అక్విడెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మండలంలోని మోపిదేవి వార్పు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఐ లవ్ దివిసీమ బోర్డుని గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మండలి యుగంధర్ అందించిన రూ.40వేలు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన మొక్కలను ఉద్యానవనంలో నాటారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ ఎస్ అరుంధతి, ఏఈలు రవితేజ, విజయ్‌కుమార్, తానేటి ప్రసాద్ పాల్గొన్నారు.



